నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 31 డిసెంబర్ 2023 | NIZAMABAD

అడ్వాన్స్‌డ్ హ్యాపీ న్యూ ఇయర్

మాక్లూర్ మండలంలోని అమ్రాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ రమేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు..తాము తయారు చేసిన ప్లకార్డులతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. శనివారం ప్లకార్డులను ప్రదర్శించి అడ్వాన్స్‌డ్ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

– మాక్లూర్, డిసెంబర్ 30

విద్యార్థుల కోసం
బస్సులు నడపాలి

'మహాలక్ష్మి' వచ్చాక బస్సుల సంఖ్యను తగ్గించారు

సమయానికి బస్సులు లేక పరీక్షకు దూరమైన 20 మంది విద్యార్థులు

ఆర్టీసీ అధికారులపై ఏబీవీపీ నాయకుల ఆగ్రహం

కామారెడ్డి, బాన్సువాడలో ధర్నా

కామారెడ్డి/బాన్సువాడ టౌన్, డిసెంబర్ 30 : విద్యార్థుల కోసం బస్సులు నడపాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో, బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకువచ్చి బస్సుల సంఖ్యను తగ్గించిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నామంటూ రోజువారీగా నడవాల్సిన బస్సులను కుదించి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. సమయానుకూలంగా బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఓ పరీక్షకు 20 మంది విద్యార్థులు కేంద్రానికి సకాలంలో చేరుకోలేకపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కళాశాలలు, పాఠశాలల సమయానికి అనుకూలంగా బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో డిపో మేనేజర్ ఇందిర అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. సరైన సమయానికి బస్సులను నడుపుతామని హామీ ఇచ్చారు. ఒకవేళ సరైన సమయానికి బస్సులను నడపకపోతే డిపో మేనేజర్ చాంబర్‌ను ముట్టడిస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, కేంద్ర నగర కార్యదర్శి కృష్ణ, కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖలీఫ్, ప్రత్యూష, సంజయ్, బాన్సువాడ ధర్నాలో నగర కార్యదర్శి హనుతేజ్, జోనల్ ఇన్‌చార్జి జస్వంత్, ఆనంద్, అరవింద్, నాగేశ్, అభిషేక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు



సాటాపూర్‌లో ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగిన మహిళలు

దరఖాస్తు చాటున
దోపిడి

గాడితప్పిన ప్రజాపాలన ప్రక్రియ

పట్టించుకునే నాథుడు లేక జనం అవస్థలు

ఉన్నతాధికారుల ఆదేశాలు మాటలకే పరిమితం

జిరాక్స్ కాగితాలే దిక్కవుతున్నా.. స్పందన మాత్రం కరువు

ప్రజాపాలన అభయహస్తం పథకాల దరఖాస్తు ప్రక్రియ అభాసుపాలవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ తంతుతో జనాలంతా ఇబ్బందులు పడుతున్నారు. మూడోరోజు కూడా ఉభయ జిల్లాల్లో ప్రజలంతా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారులు ఒకటి చెబుతుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరేలా దాపురిస్తున్నాయి. జిరాక్స్ ప్రతులను సైతం స్వీకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్వయంగా చెప్పినప్పటికీ కౌంటర్ల వద్ద టీమ్‌లీడర్లు మాత్రం ససేమిరా అంటున్న దాఖలాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. కౌంటర్లలో దరఖాస్తుల కట్టలు నిమిషాల్లో అయిపోతుండడంతో కిందిస్థాయి సిబ్బంది తలలు పట్టుకోవాల్సి వస్తున్నది. దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారంతా మొండి చేయితో వెనక్కి పోవాల్సిన పరిస్థితి నిజామాబాద్ నగరంలో చోటు చేసుకున్నది. చేసేది లేక జిరాక్స్ సెంటర్లలో డబ్బులు పెట్టి ఫారాలు కొనుక్కొని ప్రజాపాలన కౌంటర్లలో అందజేస్తున్నారు. జిరాక్స్ ప్రతులను కొన్ని చోట్ల తిరస్కరిస్తుంటే మరికొన్ని చోట్ల స్వీకరిస్తున్నారు.

–నిజామాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ కొన్ని వర్గాలకు దోపిడీ దందాగా మారింది. జిరాక్స్ సెంటర్లలో అధిక ధరలకు వీటిని అంటగడుతున్నారు. మరోవైపు దరఖాస్తు ఫారాలను నింపేందుకు పలువురు రూ.50వరకు వసూలు చేస్తున్నారు. అమాయక ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. కౌంటర్ల వద్ద ఫారాలను నింపేందుకు సహాయకులను నియమించకపోవడం అన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో మొదలైన ఈ ప్రక్రియలో దరఖాస్తులు ఇవ్వకపోతే కేసీఆర్ పథకాలు నిలిచిపోతాయని, కాంగ్రెస్ సర్కారు ఇచ్చే ప్రయోజనాలు రావనే భయంతో ఉరుకులు పరుగుల మీద దరఖాస్తుల కోసం జనాలంతా ఆసక్తి చూపుతున్నారు. ప్రజాపాలనకు గడువు ఉన్నప్పటికీ గ్రామాల్లో, వార్డుల్లో వారికి అవగాహన కల్పించే వారు కరువయ్యారు. ఇంటింటికీ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడా అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం కూడా ప్రజలకు శాపంగా దాపురిస్తున్నది.

సహాయకులను నియమించండి.. దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల వద్ద సహాయకులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్నందున వారందరికీ ఫారాలను నింపడం కష్టతరంగా మారింది. దీంతో డబ్బులు పెట్టి ఫారాలను నింపి కౌంటర్లలో అందిస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియ మొదలై మూడు రోజులు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో అయోమయం తొలగలేదు. దరఖాస్తులతోపాటు కుటుంబీకులందరి ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు జిరాక్స్ ప్రతులను జతచేస్తున్నారు. అవసరం లేకున్నా కరెంట్ బిల్లు, గ్యాస్ బుక్ జిరాక్స్‌లను సైతం జత చేస్తున్నారు. గ్రామాల్లో రాత్రి వేళ దండోరా వేయించి స్పష్టమైన మార్గదర్శకాలను చెబితే ప్రయోజనం ఉంటుంది. నిజామాబాద్‌లో నగర పాలక సంస్థ సిబ్బంది చాలా చోట్ల అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కౌంటర్లను ఇతర సిబ్బందికి వదిలేసి వెళ్లి పోతున్నారని తెలుస్తున్నది.

'ప్రజాపాలన'లో సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు

పత్తాలేని ఆరోగ్య శాఖ కార్యకర్తలు

సపర్యలు చేసిన స్థానికులు

నిజాంసాగర్, డిసెంబర్ 30: జుక్కల్ మండలం మహ్మదాబాద్ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు అదే గ్రామానికి చెందిన శివమ్మ అనే వృద్ధురాలు వచ్చింది. కొద్దిసేపటికి అక్కడే ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు కంగారు పడి వెంటనే సపర్యలు చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఆరోగ్యశాఖ కార్యకర్తలెవరూ అక్కడ కనిపించకపోవడం గమనార్హం. కార్యక్రమాన్ని ఉదయం 8 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా..అధికారులు ఇష్టానుసారం నిర్వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఫారాల కొరతపై మండిపడ్డ జనం

సాటాపూర్‌లో అర్ధాంతరంగా ముగిసిన గ్రామసభ

రెంజల్, డిసెంబర్ 30: రెంజల్ మండలం సాటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ అర్ధాంతరం గా ముగిసింది. అధికారులు ముం దస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడుతున్నదని, ఫారాలకు రూ.50 ఖర్చు అవుతున్నదని గ్రామస్తులు ఎంపీడీవో శంకర్‌తో వాగ్వాదానికి దిగారు. ఫారాల కొరత ఉన్నదని, బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని జనం మండిపడ్డారు. దీంతో గ్రామసభ నుంచి మండలస్థాయి అధికారులు వెనుదిరిగారు. అంతకుముందు సభలో ఎంపీడీవో శంకర్ సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. దరఖాస్తు విధానంపై అవగాహన కల్పిస్తుండగా, పథకాల వర్తింపు విషయంలో స్థానిక నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. పోలీసులు వారిని సముదాయించారు.

మారుమూల పల్లె..
కొలువుల ముల్లె..

సండే స్పెషల్

ఇంటికొకరు 'ఉద్యోగస్తులు'

45కుటుంబాల్లో ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం

55 కుటుంబాల్లో ప్రైవేటు ఉద్యోగం

క్రీడల్లోనూ మేటి మెట్టు గ్రామస్తులు

అదొక మారుమూల పల్లె. ఆ ఊరికో ప్రత్యేకత ఉన్నది. ఈ ఊరిలో ఏ ఇంటికెళ్లినా ప్రభుత్వ ఉద్యోగస్తులే కనిపిస్తారు. జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉన్నతస్థాయికి ఎదగడంలో వారికి వారే సాటి. పోటీతత్వం వారికి వెన్నతో పెట్టిన విద్య. ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతారు. గ్రామంలోని యువకులు ఆటల్లోనూ మేటిగా రాణిస్తారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఆ గ్రామమే మాక్లూర్ మండలంలోని మెట్టు. ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరికైనా ప్రభుత్వ ఉద్యోగం ఉండాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ఊరిపై **నమస్తే తెలంగాణ** ప్రత్యేక కథనం...

–మాక్లూర్, డిసెంబర్ 30

మెట్టు గ్రామ ముఖచిత్రం

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని మెట్టు గ్రామం. నూతన గ్రామ పంచాయతీ అయిన ఈ పల్లెలో 100 కుటుంబాలు, 400కు పైగా జనాభా ఉంటుంది. ఇందులో సుమారు 50 కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ఈ గ్రామంలో యువకులందరూ చదువుపై ప్రత్యేక దృష్టిసారించి కొలువులు సాధించారు.

ఇంటికొకరికి ఉద్యోగం..

వందకుపైగా కుటుంబాల్లో ఇంటికి ఒకరు చొప్పున ఉద్యోగం సాధించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సర్కారు ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని 50 కుటుంబాల్లో 45మంది వరకు ఉద్యోగం సంపాదించారు. పీఈటీలు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, వెటర్నరీ శాఖ, పోలీస్‌శాఖ, అటవీశాఖ, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు 50 మంది వరకు ఉన్నారు. మిగతా 50కుటుంబాల్లో ఇంటికి ఒకరు చొప్పున ఏదో ఒక రంగంలో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు.

స్వయం ఉపాధి కోసం పాడిపరిశ్రమ..

మెట్టు గ్రామంలోని యువతీయువకులు ఉద్యోగాల వేటతోపాటు వ్యవసాయం, పాడి పరిశ్రమపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. మహిళా సంఘాలు, మ్యాక్స్ సంఘాల ద్వారా రుణాలు పొందుతూ బర్రెలను కొనుగోలు చేసి పాల వ్యాపారం కూడా చేస్తారు. ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు, సంస్థల్లో ఉద్యోగం సంపాదించగానే వారి తల్లిదండ్రులు ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తారు.

క్రీడల్లోనూ ముందంజ

ఉద్యోగాలు పొందడానికి యువకులు పలు క్రీడల్లో నైపుణ్యం కలిగి ఉన్నారు. డిసెంబర్ మాసంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా యేటా మండలస్థాయిలో వాలీబాల్, కబడ్డీ, క్యారం, చెస్, ఖోఖో, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తారు. ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారు కూడా స్వగ్రామానికి వచ్చి పోటీల్లో పాల్గొంటారు. ఇక్కడ రాణించిన క్రీడాకారులు మండల, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్రీడా కోటాలోనే తమకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా వచ్చాయని అంటున్నారు.

ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా..

ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాను. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే కోరికతో పోలీస్‌శాఖలో చేరాను. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాను. సీనియర్లు చక్కని సలహాలు ఇస్తారు. మా స్ఫూర్తితో మరికొంత మంది ఉద్యోగాలు సాధించారు.

- సెడ్రిక్, ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్, మెట్టు

సీనియర్లు ఆదర్శం..

గ్రామంలో మాకన్నా ముందుగా ఉద్యోగం సాధించిన సీనియర్లను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాం. ఇంటి వద్ద వ్యవసాయం పనులు చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి సిరిసిల్ల జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నాను. యువకులకు సలహాలు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తాం.

- రతన్ రిచర్డ్, ఫారెస్ట్ బీట్ అధికారి (సిరిసిల్ల జిల్లా), మెట్టు

కస్టమ్ మిల్లింగ్ వేగవంతం చేయాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మతు

నిజామాబాద్ స్పోర్ట్స్/కామారెడ్డి, డిసెంబర్ 30 : రైస్‌మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కలెక్టర్లకు సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్. చౌహాన్‌తో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎంఆర్ లక్ష్య సాధనపై సమీక్షించారు. జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ కోటా నిల్వలను ప్రస్తావించారు. ఇప్పటికే ఈ నెల 31 నాటితో ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు చేరవేయాల్సిన గడువు పూర్తవుతుందని గుర్తుచేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా మిల్లింగ్‌ను పూర్తి చేయించి బియ్యం నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కస్టమ్ మిల్లింగ్ అంశంపై నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పందిస్తూ జిల్లాలోని రైస్‌మిల్లర్లకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశిస్తూ సీఎంఆర్ మిల్లింగ్ వేగవంతం చేశామని మంత్రి దృష్టికి తెచ్చారు. మిల్లింగ్ పూర్తయిన వెంటనే బియ్యం నిల్వలను ఎఫ్‌సీఐ గిడ్డంగులకు చేరవేస్తున్నామని తెలిపారు. నెల రోజుల్లో సీఎంఆర్ మిల్లింగ్ 100 శాతం పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. వానకాలంలో కేటాయించిన సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్‌ను పూర్తి చేసిన రైస్‌మిల్లులకే యాసంగిలో ధాన్యం కేటాయిస్తామని రైస్‌మిల్లర్లకు స్పష్టం చేసినట్లు తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో గత యాసంగిలో పండించిన ధాన్యం 2,18,193 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉన్నదని, తక్షణమే మిల్లింగ్ పూర్తి చేసి సీఎంఆర్‌కు అందజేస్తామన్నారు. బాయిల్డ్ రైస్ 1,15,828 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉన్నదని త్వరగా మిల్లింగ్ చేయిస్తామని చెప్పారు. వీసీలో ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నగరంలో నకిలీ మందుల విక్రయాలు

ఏజెన్సీపై ఔషధ నియంత్రణ అధికారుల దాడి

రూ. 6లక్షల విలువైన నకిలీ మందులు స్వాధీనం

ఖిల్లీవాడి/ నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 30 : జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ పరిధి శ్రీనగర్ కాలనీలో బయోమెట్రిక్ ఫార్మాసిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసిన ఏజెన్సీలో ఔషధ నియంత్రణ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించి.. రూ. 6 లక్షల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఔషధ తయారీ కేంద్రాలపై దాడుల్లో భాగంగా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఇన్‌స్పెక్టర్ సహజ బింద్ కలిసి రామ్ ఫార్మాస్యూటికల్స్‌లో తనిఖీలు నిర్వహించారు. అందులో తయారు చేసిన మందులను స్వాధీనం చేసుకొన్నారు.అక్కడి నుంచి మందులను డైలీ పార్సిల్ సేవల ద్వారా నిజామాబాద్‌కు పంపిస్తున్నారని తెలుసుకొని నిజామాబాద్ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో డిప్యూటీ డైరెక్టర్ పి.సరళ,అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.నర్సయ్య ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్, రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.శ్రీకాంత్,ఆర్.శ్రీలత బృందం సభ్యులు బయోమెట్రిక్ ఫార్మాసిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించి మందులను సీజ్ చేశారు. సీజ్ చేసిన మందుల విలువ రూ.6లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నకిలీ మందులు విక్రయిస్తున్న ఏజెన్సీ డైరెక్టర్ కె.రజిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీల్లో పట్టుకున్న మందులు

ప్రజల ప్రగతి కోసమే
ప్రజాన్యాయ పీఠాలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

నిజామాబాద్ లీగల్, డిసెంబర్ 30: సమాజంలో మానవ సంబంధాలే ముఖ్యమని, కక్షలు విచ్ఛిన్నానికి దారితీస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. పౌరుల మధ్య పొరపొచ్చాలు, పగలు, ప్రతీకారాలు ప్రమాదకర హేతువులని, హేతుబద్ధంగా జీవించడం నేర్చుకోవాలని ఆమె కోరారు. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ డీసీపీ జయరాంతో కలిసి శనివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. పౌరుల మధ్య దీర్ఘకాలిక శత్రుత్వాలు కొనసాగరాదనే ఉద్దేశంతో లోక్ అదాలత్‌లు నిర్వహిస్తూ, అన్ని రకాల సివిల్ దావాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ పదకొండేండ్లుగా కొనసాగుతున్న ఓ సివిల్ వివాదాన్ని న్యాయసేవా సంస్థ సహకారంతో పరిష్కరించుకొని భీమ్‌గల్ భూనష్ట పరిహార బాధితులకు రూ.3.9 కోట్ల బ్యాంక్ చెక్‌ను అందజేసి ముగింపు పలికామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అదనపు జిల్లా జడ్జి ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు, బార్ అధ్యక్షుడు చాండక్ దేవదాస్, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

'ప్రజాపాలన' పరిశీలన

ఇందల్వాయి, డిసెంబర్ 30: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు పథకాలను కచ్చితంగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

అంకాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 30: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.